క్లుప్తంగా

పుట్ట హుండీ కానుకల లెక్కింపు



పొన్నూరు: మండలంలోని కట్టెంపూడిలోని శ్రీ నాగేంద్రస్వామి దేవస్థానం(పుట్ట)కు సంబంధించిన హుండీ కానుకలను శనివారం లెక్కించగా మూడు నెలలకు రూ.1,36,950 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నిడమనూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.కుమార్‌బాబు, వై.పద్మారావు, ఆలయ అర్చకులు పవన్‌కుమార్, నండూరి జయదేవ్ పాల్గొన్నారు.

పొన్నూరులో 95 శాతం పింఛన్ల పంపిణీ



పొన్నూరు: మండల, పట్టణ పరిధిలోని వార్డులలో శనివారం సచివాలయ ఉద్యోగులు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలో మొత్తం 31 వార్డులలోని 17 సచివాలయాల పరిధిలో 5,815 మంది పింఛన్‌దారులు ఉండగా సాయంత్రం 6 గంటల వరకు 5,640 మందికి 97 శాతం పంపిణీ చేసినట్లు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. మండల పరిధిలో 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది చెప్పారు. మొత్తం 9,947 పింఛన్లు ఉండగా, వాటిలో 9,363 మందికి పింఛన్లు అందజేశారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

గుంటూరు రూరల్: అనారోగ్య సమస్యలకు మనం తీసుకునే ఆహారమే కారణమని మిల్లెట్ రాంబాబు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో చిరుధాన్యాలతో ఆరోగ్యం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, వరిగలు, ఆరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలు లాంటివి అన్నీ చిరుధాన్యాలేనని తెలిపారు. మిగతా వాటితో పోల్చుకుంటే చి(సి)రిధాన్యాలలో రోగాలను నయం చేయగల శక్తి ఉందని చెప్పారు. కార్యక్రమంలో రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఉపాధి


సేంద్రియ వ్యవసాయంతో ఉపాధి పొందవచ్చని రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ఫౌండేషన్‌లో ఎస్‌ఆర్‌ఎం కళాశాల విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఎం కాలేజీ డెప్యూటీ మేనేజర్ వేణుగోపాల్, అసోసియేట్ ప్రొఫెసర్ వందనాస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలలో 'చిప్స్' ప్రతిభ



గుంటూరు రూరల్: స్థాయి ఆటలపోటీలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపి రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవటం సంతోషకరమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటినట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు వాలీబాల్, ఉమెన్ రన్నింగ్‌లో ప్రథమ స్థానం, ఉమెన్ కబడ్డీలో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, త్రోబాల్‌లో ప్రథమ స్థానం సాధించారని వివరించారు.

బ్రహ్మేశ్వరునికి జ్యోతిర్లింగార్చన



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబికా సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయం శివ నామ స్మరణతో మార్మోగిపోయింది. మాస శివ రాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో బ్రహ్మేశ్వరునికి జ్యోతిర్లింగార్చన చేశారు. అర్చకులు డి.కృష్ణశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రాత్రి కర్పూర హారతి కార్యక్రమాన్ని నేత్ర పర్వంగా జరిపారు. పదకొండు కేజీల కర్పూరంతో కర్పూర జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో ఈఓ కృపాల్ రెడ్డి పాల్గొన్నారు. కాగా శుక్రవారం రాత్రి ప్రత్తిపాడులోని గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయంలో కర్పూర హారతి నిర్వహించారు. అయ్యప్ప భక్తులు జ్యోతి వద్ద అయ్యప్ప పాటలతో భజనలు చేశారు.

శిథిల భవనం.. సమస్యలు పదిలం

- రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..
- తహసీల్దార్ కార్యాలయం దుస్థితి



పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం

పొన్నూరు: తహసీల్దార్ శిథిలావస్థకు చేరింది. నిత్యం సమస్యలు పరిష్కారానికే కృషి చేసే రెవెన్యూ సిబ్బందికి కష్టాలు తప్పడం లేదు. దశాబ్దాల క్రితం నిర్మితమైన భవనమే దిక్కు అయింది. భవనంలోని పలుచోట్ల పెచ్చులు ఊడి, పైకప్పు చెక్కలు పూర్తిస్థాయిలో విరిగిపోయి ఉండటంతో ఎప్పుడు కూలుతుందో అనే భయం సిబ్బందిని వెంటాడుతోంది. మండల పరిధిలోని 29 గ్రామాలతో పాటు పట్టణం నుంచి వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో పనిచేసిన అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించినా ఫలితం లభించలేదు.

అసాంఘిక కార్యకలాపాలకు..

పట్టణ నడిబొడ్డున ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి భద్రత కూడా కరువైంది. కార్యాలయం వెనుక భాగం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. చుట్టూ ప్రహరీ లేని కారణంగా మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం తాగి సీసాలు, గ్లాసులు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి.



పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉన్న కప్పు పైభాగం



వెనుకభాగాన పడేసి ఉన్న మద్యం సీసాలు, గ్లాసులు

సీసీ కెమెరాలు ఉన్నా భద్రత కరువు



తహసీల్దార్ కార్యాలయంలో భద్రత కోసం ఐదు నెలల క్రితం ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ఎనిమిది సీసీ కెమెరాలతో కార్యాలయ ఆవరణతో పాటు వెనుక భాగాన జరిగే కార్యకలాపాలు, రికార్డుల భద్రత, సిబ్బంది పనితీరు, సిబ్బందితో వాదనలు, ఎలాంటి ఘటనలైనా కెమెరాల్లో బంధించి శాఖాపరమైన చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్ని భద్రతా చర్యలు చేపట్టినా పలు సమస్యలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ ఆవరణలో జరిగే కార్యకలాపాలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

నడి రోడ్లపైనే..!

- పాపం.. పింఛను కోసం పండుటాకుల అవస్థలు
- నిలువుకాళ్లపై గంటల తరబడి నిలబడాల్సిన దుస్థితి
- ప్రత్తిపాడు మండలంలో 'ఇంటింటికీ పింఛను'కు మంగళం



ప్రత్తిపాడు ఎల్‌ఈ పాఠశాల సమీపంలో రోడ్డుపై పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో అనేక పంచాయతీల్లో ఇంటింటికీ పింఛనుకు యంత్రాంగం మంగళం పాడేసింది. డిశంబరు ఒకటో తేదీన సెలవు కావడంతో శనివారం పింఛన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో శనివారం మండలంలో అధికారులు ప్రారంభించిన పింఛన్ల పంపిణీ సగానికి పైగా గ్రామాల్లో ప్రహసనంగా మారింది. పంపిణీ సిబ్బంది ఒక చోట కూర్చుని వీధి చివరకో, నడిరోడ్లపైకో వృద్ధులను పిలిచి పింఛను అందించారు.

- ప్రత్తిపాడులో పోతురాజుమిట్ట సమీపంలో ప్రత్తిపాడు-2 సచివాలయ ఉద్యోగి ఇదిగో ఇలా వీధి చివరన అరుగులపై కూర్చుని పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో చుట్టుపక్కల ఉన్న వృద్ధులంతా అక్కడకు వచ్చి పింఛను కోసం గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది.
- రావిపాటివారిపాలెంలో కూడా ఓ వీధిలో ఇలా సచివాలయ ఉద్యోగి అరుగులపై కూర్చుని ఆ చుట్టుపక్కల లబ్ధిదారులందరినీ ఓ చోటకు చేర్చి పింఛన్లను పంపిణీ చేశారు.
- తుమ్మలపాలెం పంచాయతీ పార్వతీపురంలో అయితే ఏకంగా మూసి వేసిన పాత పాఠశాల ఆవరణలో వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేశారు.
- ప్రత్తిపాడు ఎస్సీ కాలనీలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త ఇలా వీధిలో కుర్చీలో కూర్చుని లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. సర్వర్ రాకపోవడంతో ఇలానే వృద్ధులు నిరీక్షించాల్సి వచ్చింది.
- నడింపాలెం ముస్లిం ఏరియాలో కూడా ఓ వీఆర్వో ఒక ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుని లబ్ధిదారులను అక్కడకు పిలిపించి పింఛను అందించారు.
- నడింపాలెంలో పోలేరమ్మతల్లి గుడి సెంటరులో సచివాలయ ఉద్యోగి గుడి వద్ద వృద్ధులను నిలబెట్టి అక్కడే పింఛను పంపిణీ చేశాడు.
- అదేవిధంగా ప్రత్తిపాడు నాయుళ్ల రామాలయం, పీర్లచావిడి ప్రాంతాల్లో కూడా ఒక లబ్ధిదారు ఇంటి వద్ద కూర్చుని మిగిలిన లబ్ధిదారులను అక్కడకు పిలిపించి పింఛన్లు అందజేశారు.



నడింపాలెంలో ఆలయ ఆవరణలో పింఛన్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

అప్‌సైక్లింగ్‌తో పర్యావరణానికి మేలు

ప్రొఫెసర్ సూర్యసారథి బోస్



చేబ్రోలు: అప్‌సైక్లింగ్ సహాయంతో ప్లాస్టిక్‌ను క్రియేటివ్‌గా మార్చి అధిక విలువ కలిగిన వస్తువులుగా తయారు చేయడం వలన పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా, ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు దోహదం చేస్తుందని ఐఐఎస్సీ బెంగళూరులోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ సూర్యసారథి బోస్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ' ఫ్రాంటియర్స్ ఇన్ పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎన్‌సీఎఫ్‌పీఎస్‌టీ-2024)' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్ శనివారం ముగిసింది. ప్రొఫెసర్ సూర్యసారథి బోస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రీసైక్లింగ్, అప్‌సైక్లింగ్ వలన ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించి సమీప ప్రదేశాలను శుభ్రంగా ఉంచే అవకాశం ఉందని చెప్పారు. కొత్త ప్లాస్టిక్ ఉత్పత్తి కోసం అవసరమయ్యే ముడి సరుకు అవసరం కూడా తగ్గుతుందన్నారు. విషపూరిత లోహాలను నీటిలో నుంచి ఫిల్టర్ చేయడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ నీటిని శుభ్రపరిచే సాంకేతికతపై అవగాహన కల్పించారు. పూణెలోని హెచ్‌ఈఎంఆర్‌ఎల్ డీఆర్‌డీఓ సైంటిస్ట్-ఎఫ్ డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణణ్ మాట్లాడుతూ హై ఎనర్జీ మెటీరియల్స్‌లో రసాయన సంక్లిష్టతలు గుణాత్మకంగా డిజైన్ చేయడం ద్వారా తక్కువ పరిమాణంలో ఎక్కువ శక్తిని విడుదల చేయగల సామర్థ్యం ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో భాగంగా నిర్వహించిన పలు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హెడ్ కే దినకరన్, సైంటిస్ట్ డాక్టర్ కేఎస్‌ఎన్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ గుప్త చందలూరి, విజ్ఞాన్ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న డీఎం

పొన్నూరు: ఆర్టీసీ పొన్నూరు డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకొచ్చారు. పొన్నూరు డిపో నుంచి నగరం మీదుగా రేపల్లె, మచిలీపట్నానికి బస్సును ఏర్పాటు చేయాలని పట్టణానికి చెందిన మోజేష్ నాయుడు కోరారు. వెల్లలూరు సచివాలయం వద్ద పల్లెవెలుగు బస్సులు ఆపాలని గ్రామానికి చెందిన కె.సుబ్బారావు విన్నవించారు. పొన్నూరు నుంచి రమణప్పపాలెం, ఆరెమండకు బస్సులు ఏర్పాటు చేయాలని రవి కోరారు. పొన్నూరు, నారాకోడూరు, తెనాలికి బస్సు ఏర్పాటు చేయాలని అబ్దుల్ బేగ్ కోరారు. బాపట్ల నుంచి గుంటూరు వెళ్లే బస్సులకు మాచవరం వద్ద స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డీఎం తెలిపారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ భారతి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ భారతి

ప్రత్తిపాడు: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శనివారం ప్రత్తిపాడు, కొండేపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు, గొట్టిపాడు సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి.మాధవి మాట్లాడుతూ వివాహిత మహిళలను కట్నం కోసం వేధించినా, పద్దెనిమిది సంవత్సరాల లోపు చిన్నారులను బెదిరించి పనులు చేయించినా, గృహహింసకు పాల్పడుతున్నా జిల్లా రక్షణ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశాలాక్షి, హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పత్తి రైతుకు ఫెంగల్ టెన్షన్

ప్రత్తిపాడు: పత్తి రైతును ఫెంగల్ తుపాను భయం వణికిస్తుంది. మండలంలో పత్తి తీతలు దాదాపుగా ఎనభై శాతం పూర్తయ్యాయి. కొద్ది మంది రైతుల పొలాల్లో చివరి దశ తీతలు మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫెంగల్ తుపాను దూసుకొస్తుండటంతో పత్తి రైతులు నానా హైరానా పడుతున్నారు. శుక్ర, శని వారాలు మిగిలిన పత్తిని తీయించే పనిలో నిమగ్నమయ్యారు. కూలీలకు అధికంగా కూలి చెల్లించి మరీ పత్తిని తీస్తున్నారు. ఆ చిత్రమే ఇది. ప్రత్తిపాడు-గొట్టిపాడు రోడ్డులో కనిపించింది



ప్రత్తిపాడు శివారు పొలంలో పత్తి తీస్తున్న కూలీలు

ప్రొఫెసర్ రామారావుకు ఏబీఏపీ సీనియర్ సైంటిస్ట్ అవార్డు



రామారావును అభినందిస్తున్న కళాశాల అధినేత వైవీ ఆంజనేయులు

గుంటూరు రూరల్: చలపతి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ సంస్థ సీనియర్ సైంటిస్ట్ అవార్డును ప్రకటించటం సంతోషంగా ఉందని విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. వైవీ మాట్లాడుతూ నిబద్ధతకు పట్టంగా పేర్కొన్నారు. ఈ అవార్డును డిసెంబర్ 19- 21వ తేదీలలో ఉత్తర ప్రదేశ్ మాంగల్యధాన్ యూనివర్సిటీలో నిర్వహించే 18వ వార్షికోత్సవ సమావేశంలో అందజేస్తారని తెలిపారు. ఫార్మసీ విద్య, పరిశోధనా రంగంలో 32 సంవత్సరాలకుపైగా అనుభవం కలిగి 200కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించి, 7 పుస్తకాలను రచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా 3 పేటెంట్లను సొంతం చేసుకున్నారన్నారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యునిగా నియమితులై నాణ్యమైన ఫార్మసీ విద్య కోసం ఎన్నో నూతన ఆవిష్కరణలు చేసి సమాజంలో మన్ననలను పొందారన్నారు. ఫార్మసీ కళాశాల అధ్యాపక బృందం, తదితరులు అవార్డు పొందిన రామారావును అభినందించారు.

టీసీఎస్‌కు 321 మంది ఎంపిక

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్ అందించేందుకు నైపుణ్యాలతో కూడిన విద్యావిధానాలు అందించి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఈ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభను చూపి భారీగా 321 మంది విద్యార్థులు ప్రైమ్‌రోల్‌లో రూ.9 లక్షల ప్యాకేజీ, డిజిటల్ రోల్‌లో రూ.7 లక్షల ప్యాకేజీ, నింజా రోల్‌లో రూ.3.5 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలను పొందారని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు తాము అందిస్తున్న మెరుగైన శిక్షణకు ఈ ఉద్యోగాలే నిదర్శనమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలిపారు. ఎంపికల్లో సీఎస్‌ఈ విభాగం నుంచి 102 మంది, ఈసీఈ విభాగం నుంచి 51 మంది, ఐటీ విభాగం నుంచి 45 మంది, సీఎస్‌ఎం విభాగం నుంచి 33 మంది, ఎస్‌బీఎస్ విభాగం నుంచి 26 మంది, సీఎస్‌డీ విభాగం నుంచి 20 మంది, ఐఓటీ విభాగం నుంచి 20 మంది, ఈఈఈ నుంచి 9 మంది, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి 5 మంది, సివిల్ ఇంజనీరింగ్ నుంచి 3 మంది, ఎంసీఏ నుంచి 7 గురు ఉద్యోగాలు పొందినట్లు ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.జగదీష్ మద్దినేని తెలిపారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో కళ్లం...

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాలతో కూడిన విద్యనందిస్తున్నట్లు కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కోర్ ఇంజినీరింగ్ కంపెనీ ఎస్‌టీఎస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 66 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్రాంగణిక ఎంపికలలో ఉద్యోగాలు పొందిన ఇంజనీరింగ్ విద్యార్థులు ఫైబర్ ఆప్టిక్స్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలు పొందారని వార్షిక వేతనం రూ.4 లక్షలు ఇంటర్న్‌షిప్ అనంతరం పొందుతారని కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధి సతీష్ తెలిపారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు డాక్టర్ యు.సూర్యనారాయణ, డాక్టర్ కె.హరికృష్ణ, ప్రొఫెసర్ రాజు అభినందించారు.

కిట్స్‌లో ముగిసిన ఎఫ్‌డీపీ

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అటల్, ఏఐసీటీఈ సహకారంతో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) ముగిసింది. కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో గత నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రోల్ ఆఫ్ పవర్ ఎలక్ట్రానిక్స్ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీలో నిర్వహించిన అటల్ ఎఫ్‌డీపీకి రిసోర్స్ పర్సన్‌లుగా యూనివర్సిటీ ఆఫ్ కెనడాకు చెందిన డాక్టర్ విక్రమ్ కుమార్ కాంబోజ్, డాక్టర్ అమిత్ కోహిల్, ఏపీ ఎన్ఐటీకి చెందిన డాక్టర్ పి.శంకర్, డాక్టర్ టి.రమేష్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన శ్రవణ్ కుమార్, వై.ఎస్. కిషోర్‌బాబు, నితీష్ తివారి, ఎం. జగన్‌మోహన్‌రావు, కె.సతీష్ వ్యవహరించారు. ఎలక్ట్రిక్ వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్ పాత్ర, చార్జింగ్ సిస్టమ్స్, మౌలిక సదుపాయాలు, న్యూటెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం.. వంటి పలు అంశాలపై వివరించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్. పి.బాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ వై.రాజేష్ తెలిపారు. శనివారం ముగింపు కార్యక్రమంలో ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ అధ్యాపకులు ఎఫ్‌డీపీలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎఫ్‌డీపీ కోకోఆర్డినేటర్ రాజా నాయక్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

వైఎస్సార్‌ఎస్‌యూ ఆరోపణ



ఏఎన్‌యూ వీసీ గంగాధరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో మహిళా వసతి గృహాల్లో విద్యార్థినుల భోజనంలో జెర్రిలు, కప్ప, పురుగులు వచ్చిన ఘటనకు కూటమి ప్రభుత్వ నిర్లక్షమే ప్రధాన కారణమని వైఎస్సార్ విద్యార్థి సంఘం(వైఎస్సార్‌ఎస్‌యూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ఆరోపించారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వీసీని కోరారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థినుల భోజనంలో కప్ప రాలేదనీ, భోజనం కలుషితం కాలేదని వీసీ చెప్పడం తగదన్నారు. విద్యార్థినులు తినే భోజనంలో కప్ప రాకుంటే వేలాదిమంది విద్యార్థినిలు వీసీ భవనం ముందు ఎందుకు ధర్నా చేశారని ప్రశ్నించారు. విశ్వ విద్యాలయాలను కూటమి ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా నిర్వహిస్తుందో ఈ ఘటనే నిదర్శనమన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు కె.శివారెడ్డి,ఐ శ్రీనివాస్,ఎస్.ప్రతాప్, యస్వంత్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయం



చేబ్రోలులో మానవహారం

చేబ్రోలు: ఎయిడ్స్‌పై యువత అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయం వద్ద శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, మండల పరిషత్ సిబ్బంది కలసి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఫ్లెక్సీలు చేతపట్టి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు.

రిషితేశ్వరికి దక్కని న్యాయం

ఏఎన్‌యూ: రిషితేశ్వరి ఆత్మహత్య కేసు తీర్పుపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట కమిటీ సభ్యురాలు కే నమిత మాట్లాడుతూ ఏఎన్‌యూలో 2015 జూలై 14వ తేదీన ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక యూనివర్సిటీ హాస్టల్ గదిలో ఉరి వేసుకొని చనిపోయిందని చెప్పారు. చనిపోయే ముందు సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని తనని సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా సూసైడ్ నోట్ రాసి చనిపోయిందని పేర్కొన్నారు. ఈ కేసులో ముగ్గురు విద్యార్థులను, అప్పటి ఆర్కిటెక్చర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బాబూరావుని నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి కేసు నడచిందని, ఆ కేసును కొట్టివేస్తూ జిల్లా నాయస్థానం తీర్పు ఇవ్వడం బాధాకరమన్నారు. తక్షణమే రిషితేశ్వరి కేసులో నిందితులను శిక్షించాలని ప్రభుత్వం హైకోర్టుకి అపీల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఎం.కిరణ్, కె. రూపస్ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన తుమ్మూరు భరతకుమార్‌రెడ్డి తండ్రి సాంబిరెడ్డి డోర్ నెం. 10-9-1, పార్కు రోడ్డు, సత్తెనపల్లి మునిసిపాలిటీ వలస సమాచారం పొందినందున యావన్మందికి తెలియజేయునది ఏమనగా:-

ఈ దిగువ షెడ్యూలు ఆస్తి కొంగర సురేష్‌బాబు తండ్రి కొంగర శివరామ కృష్ణయ్య, డోర్ నెం. 15-14-147/ఏ, 5వ లైను, ఎంప్లాయిస్ కాలనీ, కాకానిరోడ్డు, గుంటూరు వారికి చెందినదని తెలియజేయడమైనది. నా క్లయింటు పైవారి నుండి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కొనుటకు అంగీకరించి కొనుగోలు చేయుచున్నారనియు, మరియు పైవారు నా క్లయింటుకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని అమ్ముటకు అంగీకరించినారనియు తెలియ చేయటమైనది. కాబట్టి నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కొనుటలో మరియు పై వారు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని నా క్లయింటుకు అమ్ముటలో ఎవ్వరికైనా అభ్యంతరములు వున్న యెడల లేక ఎవ్వరికైనా ఈ దిగువ షెడ్యూలు ఆస్తిలో హక్కులు వున్నయెడల ఈ ప్రకటన దరిమిలా 10 (పది) రోజులలో నాకు స్వయముగా గానీ లేక రిజిస్టరు పోస్టు ద్వారా గానీ తెలియజేయగలరని యావన్మందికి తెలియజేయడమైనది. అలా పది రోజులలో ఎవ్వరైనా అభ్యంతరములు పెట్టని యెడల నా క్లయింటు దిగువ షెడ్యూలు ఆస్తి నిర్వివాదమైన ఆస్తిగా భావించి కొనుగోలు చేసినట్లుగా భావించటమైనదిగా పరిగణించబడును.

షెడ్యూలు:- గుంటూరు జిల్లా పెదకాకాని సబ్ డి పెదకాకాని గ్రామపంచాయితీ ఏరియాలో చేరిన పెదకాకాని గ్రామ డి.నెం. 668లలో యు 1-50 సెంట్లు భూమికి హద్దులు:- తూర్పు: రోడ్డు హద్దు, దక్షిణం: కల్వతరపు ప్లాట్లు స్థలము హద్దు, పడమర: రోడ్డు హద్దు, ఉత్తరం: కలతరపు ప్లాటు స్థలము హద్దు. ఈ హద్దుల మధ్య యు 1-50 సెంట్లు లేక హె. 0-585 ర్లు కలి మెరక భూమిన్నీ

ఎ.వి. కృష్ణారెడ్డి, అడ్వకేట్ అండ్ నోటరి
సత్తెనపల్లి, సెల్: 98859 64507